పత్తి కొనుగోళ్లకు టెండర్లు

పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ టెండర్లను ఆహ్వానించింది. మరో రెండు నెలల్లో పంట చేతికొచ్చే అవకాశం ఉండటంతో సంబంధిత అధికారులు ముందుగానే టెండర్లకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లాలో 2026-27 సీజన్‌లో పత్తి కొనుగోళ్లకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) జిన్నింగ్, ప్రెస్సింగ్ టెండర్లను కోరింది. జిల్లాలో 42 కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు జిన్నింగ్ మిల్లుల్లో బేళ్ల కోసం టెండర్లు ఆహ్వానించింది. గతంలో ధరలతో పాటు ఇతర నిబంధనలతో ఒకే టెండర్ ప్రకటన ఇచ్చేవారు. అలాంటిది ఈ సీజన్‌లో తొలి విడత ధరల ప్రస్తావన లేకుండా ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలంటూ టెండర్ ప్రకటన ఇచ్చింది. – భానుపురి, న్యూస్‌టుడే:

సాగు ఇలా.. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో పత్తి 10.5 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం 80 లక్షల క్వింటాళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది. మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేసే సీసీఐ పత్తిని గింజలు తీసి బేళ్లుగా మార్చి సరఫరా చేయడానికి ఏటా టెండర్లు ఆహ్వానిస్తుంది. ఒకటి రెండు నెలల్లో క్రయవిక్రయాలు ప్రారంభించే అవకాశం ఉండటంతో వ్యాపారులతో పాటు సీసీఐ పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



తుంగతుర్తి పరిధిలో సాగు చేసిన పత్తి

42 కేంద్రాలు... జిల్లాలో 21 మార్కెట్ యార్డుల పరిధిలో 42 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. నల్గొండ 23, యాదాద్రి 13, సూర్యాపేట జిల్లాలో 6 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఈసారి కూడా అవే ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాల వారీగా కొనుగోలు చేసే పత్తిని బేళ్లుగా మార్చేందుకు ఏటా జిన్నింగ్‌లను అద్దెకు తీసుకుంటున్నారు. జిల్లాల వారీగా సాగు, పత్తి దిగుబడుల అంచనాల మేరకు కొనుగోలు కేంద్రాలు, జిన్నింగులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీజన్‌లో జిన్నింగ్‌లు, గిడ్డంగులు, బేళ్ల రవాణాకు వాహనాలు, తాత్కాలిక ఉద్యోగులు తదితర వాటికి కూడా టెండర్లను ఆహ్వానించినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

యాదగిరీశుడి కల్యాణ వైభవం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో కొలువై ఉన్న అర్చామూర్తులను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆచారంగా స్వయంభూ మూర్తులను మేల్కొల్పిన పూజారులు హారతి నివేదన జరిపారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య కల్యాణం ఆలయ ఆచారంగా నిర్వహించారు. జోడు సేవోత్సవం జరిపారు.



శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణం

ఆ డబ్బులు ఏమయ్యాయో..!

● రూ.26 లక్షలు గల్లంతైనట్లు సమాచారం ● ఎన్నికల డిపాజిట్ సొమ్ములో అవకతవకలు



నియోజకవర్గం	సర్పంచులు	వార్డు సభ్యులు
సూర్యాపేట	115	1008
కోదాడ	121	1,114
హుజూర్‌నగర్	146	1318
తుంగతుర్తి	104	975

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల డిపాజిట్ సొమ్ము లెక్కల్లో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థుల నుంచి డిపాజిట్ల రూపంలో సేకరించిన డబ్బులు వ్యవహారం లెక్కలు నేటికీ తేలడం లేదు. ఎన్నికల నిర్వహణ, ఫలితాల అనంతరం డిపాజిట్లు కోల్పోయిన వారిని మినహాయించుకొని మిగతా వారందరికీ సొమ్ము చెల్లించాల్సి ఉంది. ఎన్నికలు జరిగి ఎనిమిది నెలలు పూర్తి కావొస్తున్నా.. పోటీదారులకు మాత్రం ఆ నగదును అందించలేదు. డిపాజిట్ సొమ్మును ఎంపీడీవోలు జనరల్ ఫండ్ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. కానీ అందుకు విరుద్ధంగా కొందరు ఎన్నికల ఖర్చు కోసం..మరికొందరు సొంతానికి వాడుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఆరోవంతు వచ్చిన వారికి.. జిల్లాలో 486 గ్రామ పంచాయతీలు, 4,415 వార్డు సభ్యుల స్థానాలకు గత ఏడాది డిసెంబరులో మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. ఏకగ్రీవాలు, ఎన్నికలు నిర్వహించని స్థానాలు మినహా సర్పంచి స్థానాలకు 3,535 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 17,245 మంది నామినేషన్లు వేసి ఎన్నికల బరిలో నిలిచారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో సర్పంచి అభ్యర్థులు రూ.2 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రూ.1000, వార్డు సభ్యులు రూ.500, ఎస్సీ, ఎస్టీ, బీసీ రూ.250 చొప్పున డిపాజిట్ చేశారు. జిల్లాలో అభ్యర్థుల నుంచి సుమారు రూ.26 లక్షల డిపాజిట్లు జమైనట్లు సమాచారం. ఈ నగదు అంతా రీఫండబుల్ కేటగిరిలోకి వస్తుంది. ఎన్నికల బరిలో నిలిచి పోలైన ఓట్లలో కనీసం ఆరో వంతు వచ్చిన వారికి మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇప్పటికీ డిపాజిట్లు మాత్రం తిరిగి చెల్లించలేదని తెలుస్తోంది.

నిధులు వచ్చినా నిరాశే!.. ఎన్నికల సమయంలో విధి నిర్వహణ వేతనాల కింద ఒక్కో కార్యదర్శికి రూ.4 వేల నుంచి రూ.6 వేలు, పంచాయతీ కార్మికులకు రూ.300 చొప్పున చెల్లించారు. పంచాయతీల వారీగా ఎన్నికల నిర్వహణకు కార్యదర్శులు ఒక్కో చోట రూ.15 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చు చేశారు. వాటిని పంచాయతీ ఖాతాల నుంచి తీసుకోవద్దని మెలికపెట్టారు. దీంతో బిల్లులు చెల్లిస్తారని ఎదురు చూసిన వారికి నిరాశే ఎదురైంది. మండల స్థాయిలోని అధికారులకు ఖర్చుల నిమిత్తం నిధులు వచ్చినా కార్యదర్శులకు చెల్లించలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

వెంటనే ఇవ్వాలి.. – యాదగిరి, డీపీవో, సూర్యాపేట.

డిపాజిట్ చేసిన సొమ్మును సంబంధిత అర్హులైన అభ్యర్థులకు వెంటనే ఇవ్వాలి. తీసుకోని వారు సంబంధిత ఎంపీడీవోలను సంప్రదించాలి. ఎన్నికల నిర్వహణ ఖర్చు ప్రభుత్వం నుంచి మంజూరు కాలేదు. ప్రభుత్వానికి నివేదిక పంపించాం. మంజూరు కాగానే అందిస్తాం.



వర్షానికి కురుస్తున్న తరగతి గదిలో విద్యార్థులు

కూలితే..బాధ్యులెవరూ..?

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్ మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతలు చురకంటి శ్యాంసుందర్‌రెడ్డి తమ తల్లిదండ్రులు, కుమారుడు జ్ఞాపకార్థం నిర్మించిన తరగతి గదులతో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించిన తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. నూతన తరగతి గదుల మధ్యన గోడలు నిర్మించడంతో అవి చిన్నవిగా మారాయి. రెండు గదుల మధ్య గోడను తొలగిస్తే వంద మంది విద్యార్థులు కూర్చునే విశాల గదులు అందుబాటులో ఉంటాయి. గదుల మధ్య గోడలు తొలగించడానికి నిర్ణయం తీసుకోని పాఠశాల సిబ్బంది కూలిపోవడానికి సిద్ధంగా..ప్రమాదకరంగా మారిన గదుల్లో బోధన నిర్వహిస్తున్నారు.

● గతేడాది పాఠశాలలో నాలుగు గదులను కూల్చివేయాలని అధికారులు పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో అనుమతులు ఇచ్చినా వాటిని కూల్చకుండా ఒక గదిని తరగతి గదికి, మరొకటి ప్రధానోపాధ్యాయులు, ఇంకొకటి మహిళ ఉపాధ్యాయినుల విశ్రాంతి గదికి, మిగిలిన గదిని స్టోర్ రూమ్‌కు ఉపయోగిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే నాలుగు గదులను కూల్చి వేసి కొత్త భవనంలో గదుల మధ్య గోడలను తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● నాలుగు గదులను కూల్చివేయాలని జిల్లా అధికారులు సూచించిన విషయం వాస్తవమేనని, త్వరలోనే నూతన భవనంలోని గదులను విశాలంగా మార్చి అందులోకి విద్యార్థులను తరలించి ప్రమాదకరంగా మారిన గదులను కూల్చివేసేలా చర్యలు తీసుకుంటామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములునాయక్ 'న్యూస్‌టుడే'కి వివరించారు.

నోటీసులు ఇస్తున్నారు.. సహకారం అందిస్తున్నారు

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల్లో ఓటర్లు పేర్కొన్న వివరాల్లో లోపాలున్నాయని ఎన్నికల సంఘం అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లలో ఎంతమంది తుది జాబితాలో మిగులుతారనే దానిపై త్వరలో స్పష్టత రానుంది.
– ఈనాడు, నల్గొండ



రాజపేట మండలం మొల్లగూడెంలో నోటీసులు అందజేస్తున్న బీఎల్వో

● సర్ నిబంధనల ప్రకారం ప్రస్తుత జాబితాలోని ఓటర్లు 2002 నాటి జాబితాలోని తమ పేరు, తల్లిదండ్రుల పేరు, తాత, నానమ్మల పేర్లు, వివరాలతో మ్యాపింగ్ చేసుకోవాలి. బీఎల్‌వోలకు సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో చాలామంది ఓటర్లు తమ వివరాలను మ్యాపింగ్ చేయకుండా వదిలేశారు. మరికొందరు తప్పిదాలు, లోపాలతో కూడిన వివరాలతో మ్యాపింగ్ చేసుకున్నారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 5,56,576 మందికి నోటీసులు జారీ చేశారు.

● ఈ నెల 27 నుంచి నోటీసులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభం కాగా ఇంటింటికీ అందజేయడంలో ఆలస్యం జరుగుతోంది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించడంతో నోటీసులు అందుకునే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

● నోటీసులు అందుకున్న వారి సమస్యలు పరిష్కరించేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో, పోలింగ్‌స్టేషన్, బూత్‌లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు.

● వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారికి జారీ చేసిన నోటీసులను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సదరు ఓటర్ల తరపున కుటుంబంలోని వయోజన సభ్యులు, ఈఆర్‌వో, ఏఈఆర్వో ఎదుట ప్రత్యక్షంగా హాజరై అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, సమాచారాన్ని అందించేందుకు అనుమతి ఇస్తున్నారు.

● ప్రస్తుత ఓటర్ జాబితాలోని ఓటరు పేరుకు 2002 సర్‌లోని ఓటరు పేరుకు మధ్య తేడా, పొంతన లేకుండా ఉండటం, 2002 ఎస్ఐఆర్ జాబితాతో ఓటరు జాబితా అనుసంధానించడానికి ఉపయోగించిన వివరాల ప్రకారం వారి తల్లి, తండ్రికి మధ్య వయస్సులో వ్యత్యాసం 15 ఏళ్ల కంటే తక్కువగా ఉంటే ఓటర్లకు నోటీసులు జారీ అవుతున్నాయి.

● సర్ ప్రక్రియకు ముందు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 29,84,448 మంది ఓటర్లు ఉండగా సర్ ప్రక్రియ తర్వాత వెల్లడించిన ముసాయిదాలో 27,03,385 మంది ఓటర్లు ఉన్నారు.

వివరాలు ఇలా..

జిల్లా	గతంలో	ముసాయిదా	తగ్గుదల	మరణించిన వారు	బదిలీ	అందుబాటులో లేనివారు	నోటీసులు
నల్గొండ	15,16,253	13,57,618	1,58,635	32,517	1,00,144	6,978	2,68,798
సూర్యాపేట	10,08,252	9,11,945	96,307	26,059	48,310	6,862	1,90,676
యాదాద్రి	4,59,943	4,33,822	26,121	7,156	14,604	1,176	97,102

అనుబంధాల కలయిక.. ఆదాయ కానుక

మూడురోజుల్లో రూ.2.46 కోట్లు

రాఖీ వేడుక ఆర్టీసీకి ఆదాయం తెచ్చిపెట్టింది. సంబంధిత అధికారులు కూడా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేశారు. పట్టణాలు, ఇతర ప్రాంతాల నుంచి గ్రామాలకు వెళ్లే మహిళలు ఇబ్బందులు పడకుండా వారికి బస్సు సర్వీసు అందించారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న తమ సోదరులను కలిసి రాఖీ కట్టేందుకు పెద్ద ఎత్తున ప్రయాణాలు జరగడంతో బస్సులు కిటకిటలాడాయి. ఈనెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు జిల్లాలోని సూర్యాపేట, కోదాడ డిపోలకు ఆదాయం సమకూరింది. మూడు రోజుల్లో ఏకంగా రూ. 2.46 కోట్ల ఆదాయం వచ్చింది. పండగ నేపథ్యంలో ఈ నెల 27 నుంచే బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ కొనసాగింది.
– భానుపురి, కుడకుడ రోడ్డు, కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:



సూర్యాపేట డిపోలో బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

సూర్యాపేట డిపో ఆదాయ వివరాలు

తేదీ	తిరిగిన కి.మీ	ఆదాయం(రూ.లక్షలు)
27	60,197	47,11,826
28	68,271	67,81,036
29	61,776	50,53,434
కోదాడ డిపో..		
27	37,983	23,29,000
28	45,634	35,44,000
29	35,385	22,26,000

అదనపు ట్రిప్పులు

సూర్యాపేట, కోదాడ బస్టాండ్ల నుంచి లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. ఈ నెల 27 నుంచి 29 వరకు సూర్యాపేట డిపో పరిధిలో 28 బస్సులు 48 అదనపు ట్రిప్పులు, కోదాడ డిపో పరిధిలో 11 బస్సులు 13 అదనపు టిప్పులు తిరిగాయి. ఈ మూడు రోజుల్లో సూర్యాపేట 1,90,244, కోదాడ 1,19,002 కిలోమీటర్ల మేర బస్సులు తిరిగాయి.

చేయూతకు నేడే ఆఖరు



సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వం కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసేందుకు కసరత్తు చేపడుతోంది. ఇందులో భాగంగా తొలుత ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున అందిస్తామని ప్రకటించింది. కానీ దరఖాస్తుల స్వీకరణ, విచారణ వంటి ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఈ నెల 31 వరకు గడువు పొడిగించింది. సోమవారం నాటికి చేయూత పింఛన్లకు గడువు ముగియనుండటంతో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు పోటీ పడుతున్నారు. ప్రభుత్వం ఐదు రకాల పింఛన్లు మాత్రమే ఇస్తామని ప్రకటించడంతో మిగతా వారు ఆందోళన చెందుతున్నారు. అయిదు రకాలకు జిల్లా వ్యాప్తంగా శనివారం వరకు 17,337 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా వితంతులు, ఆ తర్వాత దివ్యాంగులు ఉన్నారు.

నిరాశలో వృద్ధులు.. జిల్లాలో దాదాపు పింఛన్ రాని అర్హులైన వృద్ధులు 25 వేల వరకు ఉన్నారు. వృద్ధాప్య పింఛన్‌కు అర్హత వయసు గతంలో 65 సంవత్సరాలుగా ఉండగా 2019లో దీన్ని 57కు తగ్గించారు. గత ప్రభుత్వంలో అర్హత వయసు కలిగిన వారిలో కొత్తవారికి చాలా తక్కువ సంఖ్యలో ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిర్వహించిన ప్రజా పాలనలోనూ వృద్ధాప్య పింఛన్ల కోసం పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. మంజూరు మాత్రం ఇప్పటి వరకు ఇవ్వలేదు. వృద్ధాప్య పింఛను పొందుతున్న వారి భర్త మరణిస్తే భార్యకు, భార్య చనిపోతే భర్తకు బదిలీ చేస్తున్నారు. కానీ 57 ఏళ్లు నిండిన వారికి మాత్రం ఈసారి కూడా అవకాశం కల్పించకపోవడంతో నిరాశే ఎదురైంది.

జిల్లాలో వచ్చిన దరఖాస్తుల వివరాలు

చేయూత	దరఖాస్తులు
వితంతువు	9,302
ఒంటరి మహిళ	1,171
దివ్యాంగులు	4,110
చేనేత	327
గీత కార్మికులు	2,424

ప్రజావాణికి..ప్రచారం కరవు

భానుపురి, న్యూస్‌టుడే: జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించే ప్రజావాణికి స్పందన కరవైంది. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి మిశ్రమ ఫలితాలు వస్తున్నాయి. కొన్ని చోట్ల స్వచ్ఛందంగా రాగా మరికొన్ని చోట్ల దరఖాస్తులు రాక ప్రజావాణి కార్యక్రమాలు వెలవెలబోతున్నాయి. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతివారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలకు అర్జీలు పెరుగుతున్న నేపథ్యంలో ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరించాలని మండల స్థాయిలో ప్రజావాణి చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని 23 మండలాల నుంచి గత సోమవారం 150 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ పంచాయతీరాజ్, విద్యుత్తు, వ్యవసాయ, ఉద్యాన, విద్య, తదితర శాఖల మండల స్థాయి అధికారులు ప్రజావాణికి వచ్చినా ప్రజల నుంచి పెద్దగా స్పందన రావడం లేదు.



సూర్యాపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రచారం అవసరం... జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిపై ప్రచారం కొరవడింది. అధికారులు అర్జీదారుల కోసం ఏర్పాటు చేస్తున్నా వినియోగించుకొనేందుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లా కేంద్రంలో గత సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 68 దరఖాస్తులు వచ్చాయి. ఇవన్నీ మండల స్థాయిలో ఇచ్చేవి కావడంతో అధికారులు అవగాహన కల్పించడం లేదు. ఇన్నాళ్లు జిల్లా కేంద్రంలో నిర్వహించడంతో ప్రజలు కూడా అక్కడికే వెళ్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి... – శిరీష, జడ్పీ సీఈవో, సూర్యాపేట

జిల్లాలోని మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి. మండల కేంద్రాల్లో నిర్వహించే కార్యక్రమంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తాం. గ్రామస్థాయిలో అధికారులు కూడా ప్రజలకు వివరించాలి.

స్వర్ణగిరిలో నిత్యారాధనలు

భువనగిరి, న్యూస్‌టుడే: స్వర్ణగిరి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధలను విశేషంగా చేపట్టారు. శ్రావణ మాసం పురస్కరించుకొని ఆదివారం పద్మావతి అమ్మవారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. మహాలక్ష్మీ హవనం జరిపారు. నిత్య కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం తిరువీధి సేవోత్సవ జరిపారు.



పద్మావతి అమ్మవారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం

హ్యామ్‌తో..హాయిగా

భానుపురి, న్యూస్‌టుడే: జిల్లాలో హ్యామ్ రోడ్ల నిర్మాణంతో ప్రజలకు ఇక్కట్లు తీరనున్నాయి. గుంతల రహదారులపై ప్రయాణించలేక వాహనదారులు, ప్రయాణికులు నిత్యం ఇక్కట్లు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా హ్యామ్ రోడ్లకు శ్రీకారం చుట్టింది. ఇక నుంచి బిల్లులు రావడం లేదని గుత్తేదారులు ముందుకు రాకపోవడం, పలుమార్లు టెండర్లు ఆహ్వానించడం వంటి సమస్యలు ఉండవు. చాలా మండలాల్లో పనులు మంజూరైనా టెండర్ల దశలోనే ఆగిపోయాయి. ఇలాంటి చిక్కులన్నీ దూరమైనట్లే. బడా గుత్తేదారులను ప్రభుత్వం రంగంలోకి దించడంతో హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) విధానం కింద పనులు వేగంగా జరగనున్నాయని అంచనా చేస్తున్నారు. ఈ కొత్త విధానంలో పనులు దక్కించుకున్న గుత్తేదారులు 15 సంవత్సరాల వరకు నిర్వహణ చేయాల్సి ఉంటుంది.



సూర్యాపేటలోని కుడకుడలో గుంతలమయంగా మారిన రోడ్డు

గుత్తేదారుడితే బాధ్యత.. రహదారి గుంతలమయంగా మారినా, వర్షాలకు కోతకు గురైనా పునరుద్ధరించే బాధ్యత సదరు గుత్తేదారుడిదే. ప్రభుత్వమే అడ్వాన్స్ కింద డబ్బులివ్వడం, బ్యాంకు రుణాలు ఇప్పించడం వంటి వెసులుబాటు ఉండటంతో ఇంతకుముందులా మరమ్మతులకు నిధుల విడుదల కొరత వంటి ఇబ్బందులూ ఉండవు. దీంతో భవిష్యత్తులోనూ దారులన్నీ మెరుగు కానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఎంపిక చేసిన దారిలో వంతెనలు, కల్వర్టులు ఉన్నా పూర్తిచేసి ప్రజలకు మార్గం సుగమం చేస్తారు. ఫలితంగా గ్రామీణ ప్రజలకు రవాణా మెరుగుపడనుంది. ప్రతిపాదనలు పంపించగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆర్అండ్‌బీ అధికారులు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

ఎక్కడెక్కడంటే.. జిల్లాలోని సూర్యాపేట-నెమ్మికల్-దంతాలపల్లి, శాంతినగర్-గోండ్రియాల రోడ్డు, మాచారం-చీదెళ్ల, మామిడాల-కుంట్లపల్లి, బరాఖత్‌గూడెం-కాగితరామచంద్రాపురం, కోదాడ-రేవూరు, రాయినిగూడెం-బరాఖత్‌గూడెం, శాంతినగర్-నడిగూడెం, హుజూర్‌నగర్ లింకు, హుజూర్‌నగర్ రింగ్‌రోడ్డు, దురాజ్‌పల్లి-గరిడేపల్లి, హుజూర్‌నగర్-యాతవాకిళ్లగూడెం, దామచర్ల-జాన్‌పహాడ్ వరకు హ్యామ్ రోడ్ల కింద మరమ్మతు చేపట్టేందుకు ఆర్అండ్‌బీ అధికారులు గుర్తించారు. ఈ రోడ్లన్నీ మొత్తం 174.6 కిలోమీటర్లు కాగా రూ.191.56 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

కుంగిన సముద్రం.. నిద్రలో యంత్రాంగం



కుంగిన ఉదయసముద్రం రిజర్వాయర్ కట్ట అంతర్భాగం

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో సుమారు 600 గ్రామాలకు తాగునీరు అందించే ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పానగల్)కు ప్రమాదం పొంచి ఉంది. రిజర్వాయర్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రాజెక్టు కట్ట లోపలి భాగం కుంగిపోయింది. దీంతో సుమారు కిలోమీటరు మేర రివిట్‌మెంట్ పూర్తిగా దెబ్బతింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1.5 టీఎంసీల మేరకు నీరు నింపితే కట్టకు ముంపు పొంచి ఉండే అవకాశం ఉంది.

❖ ఉదయ సముద్రం రిజర్వాయర్ శాశ్వత మరమ్మతులపై నీటిపారుదలశాఖ దృష్టి సారించడం లేదు. ప్రాజెక్టు నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెడుతున్నారు. శాశ్వత మరమ్మతులు చేయాలంటే ముందుగా డ్యాం సేఫ్టీ అధికారులు వచ్చి ప్రాజెక్టు కట్ట పటిష్ఠతను పరీక్షించాల్సి ఉంటుంది. తదుపరి వారు ఇచ్చిన నివేదిక ప్రకారం ఏమేరకు మరమ్మతులు చేపట్టాలన్న విషయాన్ని నిపుణులతో చర్చించి ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదిక అందించాల్సి ఉంటుంది.

❖ రిజర్వాయర్ కట్ట కుంగిపోవడం, రివిట్‌మెంట్ మరింత దెబ్బతినకుండా నీటిపారుదలశాఖ చర్యలు చేపట్టింది. రూ.45 లక్షల వ్యయంతో ఇసుక బస్తాలు ఏర్పాటు చేశారు. అవి ఎండకు ఎండి, వానకు తడవడంతో చిరిగిపోయాయి. దీంతో ఇసుక నీటిలోకి జారిపోతోంది.

ప్రతిపాదనలకు కసరత్తు:
బాలరాజు, ఈఈ, నీటిపారుదలశాఖ నల్గొండ

ఉదయసముద్రం రిజర్వాయర్ కట్ట దెబ్బతినకుండా తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తున్నాం. శాశ్వత పనుల నిర్వహణ కోసం డ్యాం సేఫ్టీ అధికారులతో పరీక్షలు నిర్వహించేందుకు ప్రక్రియ చేపడుతున్నాం. వారు ఇచ్చిన నివేదిక తర్వాత ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తాం.

పేట పోలీస్‌కు ప్రథమ స్థానం

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పనితీరులో సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపింది. అందుకు రాష్ట్ర స్థాయిలో క్లస్టర్-4 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా సాధించిన సమగ్ర పని తీరును గుర్తించి ఎస్పీ నరసింహకు డీజీపీ సీవీ ఆనంద్ కుమార్ ఆదివారం ప్రశంసాపత్రం అందించారు. ఎనిమిది కీలక విభాగాల్లో పనితీరు సూచికల ఆధారంగా ఈ ర్యాంకింగ్ కేటాయించారు. విధి నిర్వహణలో చూపిన అంకితభావం, నైపుణ్యం, విశిష్ట సేవలకు జిల్లా పోలీస్ సిబ్బందిని డీజీపీ అభినందించారు.

ఎనిమిది విభాగాలు.. ● ఛార్జ్‌షీట్ రేటు. ● నేరాల గుర్తింపు. ● శిక్షల శాతం. ● సగటు దర్యాప్తు సమయం.● బాధితుల ఇంటి వద్ద కేసుల నమోదు.● ఈ పెట్టి కేసులు ● ఈ చలాన్‌లు.● డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు

సాంకేతికతను సద్వినియోగం చేసుకుని.. – నరసింహ, ఎస్పీ

సాంకేతికతను సద్వినియోగం చేసుకొని జిల్లా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం. నేరాలను నిరోధిస్తూ పని చేస్తున్నాం. కేసుల దర్యాప్తు వేగంగా చేస్తున్నాం. బలమైన ఆధారాలు, సాక్ష్యాలను సేకరించి కోర్టుకు అందజేస్తున్నారు. కేసుల్లో నేరస్థులకు జైలు శిక్షలు పడుతున్నాయి. అందరి సమన్వయంతో ఈ విజయానికి దోహదమైంది.

ఆర్టీసీ సేవ.. సాంకేతిక తోవ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు ఆర్టీసీ సాంకేతికంగా పలు వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఆయా సైతం రెండేళ్ల ఆన్‌లైన్ చెల్లింపుల నుంచి.. బస్సు ఎక్కడుందో తెలుసుకోవడం వరకు పలు సంస్కరణలు తీసుకొచ్చింది. దీంతో పాటు.. పర్యావరణ హిత విద్యుత్తు బస్సులను, అందులో సీసీ కెమెరాలు వంటి సదుపాయాలు సైతం కల్పిస్తూ దూసుకుపోతోంది. మిర్యాలగూడ, నల్గొండ వంటి డిపోల్లో ముందస్తు ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం సైతం అందుబాటులో ఉంది. తాజాగా స్మార్ట్ టికెట్ విధానాన్ని సైతం ప్రారంభించేందుకు ఆర్టీసీ సన్నద్ధమైంది.

ఉమ్మడి జిల్లాలో డిపోలు ఇవీ..
నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, దేవరకొండ, యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి.


మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

స్మార్ట్ టికెట్ పని చేసే విధానం ఇదీ..

✦ తొలుత బస్సులో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి.
✦ అనంతరం మీ టికెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
✦ మీ టికెట్ యాప్‌ను తెరచి టీజీఆర్టీసీ కరెంట్ బుకింగ్ ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకోవాలి.
✦ ప్రయాణం, ప్రయాణికుల వివరాలు నమోదు చేయాలి.
✦ బుకింగ్‌ను నిర్ధారించడానికి చెల్లింపును పూర్తి చేయాలి.
✦ చెల్లింపు నిర్ధారణ తరువాత ఒక క్యూఆర్ కోడ్ వస్తుంది.
✦ ఇది వరకే మీ టికెట్ యాప్ ఉన్నవారు.. మీ టికెట్ క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా బస్సు లోపల ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే.. కరెంట్ బుకింగ్ ఐచ్ఛికం కనిపిస్తుంది. అక్కడ వివరాలు నమోదు చేసి.. టికెట్ పొందొచ్చు.

యూపీఐ చెల్లింపులు...

ప్రస్తుత డిజిటల్ యుగంలో అధిక శాతం మంది యూపీఐ, ఆన్‌లైన్ చెల్లింపులకు మొగ్గు చూపుతున్నారు. దీంతో బస్సుల్లో టికెట్ తీసుకునేందుకు చిల్లర సమస్య తలెత్తకుండా యూపీఐ చెల్లింపులను ప్రవేశ పెట్టింది. దీని కోసం అధునాతన టిమ్ యంత్రాలను సైతం తీసుకొచ్చింది. వీటి ద్వారా ప్రయాణికులు యూపీఐ స్కానర్‌ను స్కాన్ చేసి.. టికెట్ ఛార్జీ చెల్లించవచ్చు. ఇది ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంది.

బస్సు ఎక్కడుందో..?

ప్రయాణికులు ఎక్కాల్సిన బస్సు ఎక్కడుందో తెలుసుకోవడం కష్టంగా ఉండేది. బస్టాండ్‌లో సిబ్బందిని అడిగినా సరైన సమాధానం వచ్చేది కాదు. గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. దీనిని నివారించేందుకు ఆర్టీసీ 'గమ్యం' పేరుతో ఒక యాప్‌ను ప్రవేశ పెట్టింది. ఈ యాప్‌లో బస్సు నెంబర్, రూట్ నెంబర్ ఆధారంగా బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు. బస్సు బస్టాండ్‌కు ఎప్పుడు చేరుతుందో యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి...

– జ్యోత్స్న, ఆర్టీసీ ఆర్ఎం, నల్గొండ



సాంకేతిక పరంగా ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్ రిజర్వేషన్‌తో పాటు.. యూపీఐ చెల్లింపులు, గమ్యం యాప్ వంటివి ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. తాజాగా రానున్న స్మార్ట్ టికెట్ విధానం సైతం సమయాన్ని ఆదా చేయడంతో పాటు.. చిల్లర సమస్యకు చెక్ పెడుతుందని ఆశిస్తున్నాం.

ఆటకు.. ఆరు గంటలు


బౌలింగ్ చేస్తున్న ఊట్కూరి యశ్వీర్‌గౌడ్

రాజాపేట, ఆలేరు, న్యూస్‌టుడే: అండర్‌-19 భారత క్రికెట్ జట్టుకు రాజాపేట మండల కేంద్రానికి చెందిన కుర్రాడు ఊట్కూరి యశ్వీర్‌గౌడ్ రెండో సారి ఎంపికయ్యాడు. తాజాగా సెప్టెంబరు 18, 21, 23 తేదీల్లో ఆస్ట్రేలియా జట్టుతో జరగనున్న వన్డే క్రికెట్ పోటీల్లో భారత తరఫున ఆడనున్నాడు. అంతకు ముందు గత జులై 1 నుంచి శ్రీలంకతో జరిగిన మూడు వన్డే సిరీస్‌లోనూ యశ్వీర్ పాల్గొని ప్రతిభ చూపడం విశేషం.

✦ హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న ఈ యువకుడు రాజ్‌కుమార్, వాణి కుమారుడు. చిన్న వయసు నుంచే తన కుమారుడు క్రికెట్ ఆట పట్ల ఉన్న మక్కువను దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు ఆ రంగంలో తర్ఫీదు ఇప్పించారు. స్థానికంగా 'భవన్స్' అకాడమీలో చేర్పించారు. కోచ్ కృష్ణమోహన్ తర్ఫీదు, మెలకువలు నేర్పిన కారణంగా యశ్వీర్ ఇప్పటి వరకు పలు ట్రోఫీల్లో 50 కిపైగా మ్యాచ్‌లు ఆడి ప్రతిభ చూపడం విశేషం.

✦ అండర్‌-16 విభాగంలో 2023-24లో బీసీసీఐ ట్రోఫీలో ఆడిన 5 మ్యాచ్‌ల్లో 20 వికెట్లు, 125 పరుగులను తీయడం విశేషం. అలాగే అండర్‌-19 విభాగంలో రంజీ ట్రోఫీలో రాజ్‌కోట్‌లో ఆడిన వన్డే మ్యాచ్‌లోనూ ఏకంగా 6 వికెట్లు పడగొట్టిన ఘనత ఈ యువకుని సొంతం. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో (అండర్‌-19) కేరళ రాష్ట్ర జట్టుతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఎనిమిది వికెట్లు తీసుకుని జట్టు గెలుపునకు కీలకమయ్యాడు. ఈ మ్యాచ్‌లో తన బ్యాటింగ్ ప్రతిభను కూడా చూపే క్రమంలో 118 పరుగులను సాధించి ప్రత్యర్థి జట్టును చిత్తు చేశాడు. రోజులో కనీసం 6 గంటలు మైదానంలో క్రికెట్ సాధన చేపడుతున్న ఈయనకు అటు క్రికెట్, ఇటు చదువుపైనే తన పూర్తి ధ్యాస అంటున్నాడు.

ప్రజలకు చేరువగా.. సేవలు మెరుగ్గా

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాట్సాప్ చాట్‌బాట్‌కు కృత్రిమ మేధ (ఏఐ) అనుసంధానం చేసింది. విద్యుత్తు కార్యాలయాలకు వెళ్లకుండానే అవసరమైన పూర్తి సమాచారం తమ చరవాణి నుంచే తెలుసుకునే వెసులుబాటు కల్పించింది. 24 గంటలు, ఏడు రోజుల పాటు నిరంతరాయంగా ఉండేలా తీర్చిదిద్దారు.

◆ చరవాణిలో వాట్సాప్ ద్వారా నంబరును సంప్రదించి హాయ్ అనే సందేశం పంపించగానే టీజీఎన్‌పీడీసీఎల్ కస్టమర్ సపోర్ట్‌కి స్వాగతం! మీ విద్యుత్తు సేవల్లో మీకు సహాయం చేయడానికి మేము సంతోషంగా ఉన్నాం.. మీకు ఈ రోజు ఏ విధంగా సహాయం చేయగలం? అని సందేశం వస్తుంది. బిల్లుల వివరాలు, చెల్లింపు స్థితి, విద్యుత్తు అంతరాయ సమాచారం, ఫిర్యాదు నమోదు, కొత్త కనెక్షన్ ప్రక్రియ, కేటగిరీ మార్పు ప్రక్రియ, పేరు మార్పు ఇలా పలు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

1912కు సమాచారం ఇస్తే...

జిల్లాలో సుమారు 6 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం సర్కారు, ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ మండలి ఒక దరఖాస్తు పలు ప్రయోజనాలు అనే దానిని తీసుకొచ్చి సేవలను మరింత విస్తృతం చేసింది. స్థానికంగా ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబరు 1912కు సమాచారం అందజేస్తే ఆ ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత అధికారులకు చేరవేసేలా సాంకేతికతను రూపొందించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సందర్శించి వాటిని పరిష్కరించేలా తీర్చిదిద్దారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ విద్యుత్తు డీఈ శ్రీనివాసాచారి కోరారు.

అమ్మాయిల చదువుకు ఆసరా

నాంపల్లి, చండూరు, న్యూస్‌టుడే: అమ్మాయిలూ ఇది మీ కోసమే.. ఇంటర్ పూర్తి చేసి ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థినులకు 'కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2026-27' పేరుతో ఉపకార వేతనాలను అందిస్తోంది. అందుకు దరఖాస్తులు సమర్పించేందుకు గడువు ఈ నెల 31తో ముగుస్తుంది.



■ **ఇవీ అర్హతలు..:** నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులు వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలు మించని వారంతా అర్హులే. ఇంటర్‌లో 75శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, 2026-27 విద్యా సంవత్సరంతో మొదటి ఏడాది ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ వంటి కోర్సుల్లో చదువుతున్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత సాధిస్తే ఏడాదికి రూ.1.50 లక్షల చొప్పున కోర్సు పూర్తి చేసేవరకు ఉపకార వేతనంగా కోటక్ ఫౌండేషన్ అందించనుంది.

■ **దరఖాస్తు ఇలా..:** ఇందుకు ఆన్‌లైన్‌లో kotakeducationfoundation.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి kotakkanyascholarship2026-27 పై క్లిక్ చేసి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమయంలో ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్, కుటుంబ ఆదాయ ధ్రువపత్రం, కళాశాల నుంచి పొందిన ఫీజు వివరాల పత్రం, కళాశాల నుంచి బోనఫైడ్ ధ్రువపత్రం, కళాశాలలో ప్రవేశ అనుమతి లేఖ, ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వంటి వివరాలతో నమోదు చేసుకోవచ్చు.

ఆధునిక వంటశాల ఏర్పాటుకు సన్నాహాలు

నడిగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అల్పాహారం కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సిద్ధం చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కిచెన్ నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను విద్యా మౌలిక సదుపాయాల కల్పన విభాగం పర్యవేక్షణ చేయనుంది. సూర్యాపేట కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న కిచెన్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించనున్నారు. గతంలో పాఠశాల విద్యార్థులకే అందుబాటులో ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకు అమలు చేయనుంది. మోడల్ ప్రాజెక్ట్‌గా కొన్ని జిల్లాల్లో అమలులో ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిధిలో తొలిసారిగా ఏర్పాటు చేసిన పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 56 కళాశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. నవంబరు మొదటి వారం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించారు. సూర్యాపేటలోని సమీకృత మార్కెట్ ఆవరణలో కిచెన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండు నెలల్లో పూర్తి చేసి విద్యార్థులకు అందించాలనేది లక్ష్యం.

మెనూ ఇలా..

విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషియన్ సూచనల మేరకు మెనూ రూపొందించారు.
సోమవారం: ఇడ్లీ సాంబార్
మంగళవారం: పూరీ, ఆలుకూర్మ
బుధవారం: దోశ, చట్నీ
గురువారం: ఉప్మా చట్నీ
శుక్రవారం: మిల్లెట్ ఇడ్లీ, సాంబార్
శనివారం: బోండా, చట్నీ

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు..

జిల్లా	కళాశాలల సంఖ్య
నల్గొండ	27
యాదాద్రి	17
సూర్యాపేట	8

వాహనాల బారులు



చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లో ట్రాఫిక్ కష్టాలు ఆదివారం మరింత పెరిగాయి. రద్దీ మూలంగా కిలోమీటర్ల దూరం నిలిచిపోయిన వేల సంఖ్యలో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. స్థానికంగా జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం జరుగుతున్నందున కొన్ని నెలలుగా సర్వీసు రోడ్డుపైకి వాహనాలను మళ్లించారు. ఇరుకైన సర్వీసు రోడ్డుపై వందల కొలదీ వాహనాలు, స్థానిక పాదచారులు రాకపోకలు సాగించడానికి నిత్యం నరక యాతన పడుతున్నారు. దీనికి తోడు ఆదివారం చౌటుప్పల్‌లో వార సంతను జాతీయ రహదారి పక్కనే నిర్వహిస్తుంటారు. స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పరిశ్రమల్లో ఉపాధి కోసం వలసొచ్చిన పొరుగు రాష్ట్రాల కూలీలు సంతలో సరకుల కొనుగోళ్ల కోసం వస్తారు. మరో దారిలేక సర్వీసు రోడ్డులోంచే వాహనాలను తప్పించుకుంటూ జాతీయ రహదారిని ప్రమాదకర పరిస్థితుల్లో దాటాల్సి వస్తుంది. జాతీయ రహదారి పక్కనే కల్యాణ మండపాలున్నాయి. ఆదివారం ఈ మండపాల్లో నిర్వహించిన శుభకార్యాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రజలు, వాహనాలతో లక్కారం ప్రాంతంలోని సర్వీసు రోడ్డు కిక్కిరిసింది. అక్కడి అండర్‌పాస్‌లో వాహనాలు ముందుకు, వెనక్కు కదలలేని పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో అక్కడికొచ్చిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కారులోంచి కిందికి దిగి వాహనాలను క్రమబద్ధీకరించేందుకు కొద్దిసేపు శ్రమించారు. పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు శ్రమించారు.

ఆదర్శమవనున్న పాఠశాలలు

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ఆదర్శ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది నుంచి ఈ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలన్న యోచనలో ఉంది. ఇందుకుగాను విద్యాశాఖ ఇటీవల ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపింది. ఈ విధానం ప్రవేశపెడితే పిల్లల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోధిస్తున్నారు. అదనంగా ప్రీప్రైమరీతో పాటు 1-5 వరకు తరగతులనూ ప్రారంభించాలన్న ఆలోచన ఉంది. అయితే ప్రస్తుతం ఆదర్శ పాఠశాలలన్నీ చాలా వరకు ఊరికి దూరంగా ఉండటంతో రవాణా సౌకర్యం సరిగ్గా లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గురుకులాలు, కస్తూర్బాలు పెరగడంతో వీటిల్లో చేరే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో సీబీఎస్ఈ సిలబస్‌తోపాటు ప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు తరగతులను ప్రారంభిస్తే ప్రవేశాలు పెరిగే అవకాశం ఉంటుందని విద్యాశాఖ అంచనా వేస్తోంది. ప్రభుత్వం నుంచి త్వరలోనే ఆమోదం వచ్చే అవకాశాలున్నట్లు దేవరకొండ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆశీర్వాదం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఆదర్శ పాఠశాలల్లో చాలా వరకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులే అధికంగా ఉండటంతో ఈ విధానంతో వారికి లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు.

జిల్లా	ఆదర్శ పాఠశాలలు
నల్గొండ	17
సూర్యాపేట	09
యాదాద్రి	07

అక్టోబరు 18న యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మహిమ, శంకర్, విజయానంద్, అర్జున్, విక్రమ్ సాగర్, రాజా, రమణ

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: యువతలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు పసాలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న భువనగిరి జిల్లా మోత్కూర్‌లో ఉచిత 'యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్' నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్ సాగర్ పసాలా, సహ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అర్జున్ మదాసు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో వారు కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు. ఫెస్ట్‌లో విద్యార్థులు, యువత, విద్యావేత్తలు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ ప్రతినిధులను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత, నాయకత్వం, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఫౌండేషన్ పిల్లలు, యువత, మహిళలు, రైతులు, వృద్ధులకు విద్య, సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సామాజిక అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఫెస్ట్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఫౌండేషన్ సీఈవో గోకుల్ రమణ, ప్రోగ్రామ్ డైరెక్టర్ రాజా, రీజినల్ కోఆర్డినేటర్ పసాలా విజయానంద్, ప్రతినిధులు శంకర్, జి.మహిమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భళా.. శ్రీవిద్య



మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరుకు చెందిన తాపీ మేస్త్రీ బోడ శ్రీరాములు కుమార్తె శ్రీవిద్య యూజీసీ నెట్-జేఆర్ఎఫ్ జూన్ 2026 పరీక్షల్లో 98.4 పర్సంటేజ్ సాధించి ప్రతిభ చాటింది. చిన్న వయస్సు నుంచే విద్యలో రాణిస్తున్న ఆమె ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యనభ్యసించి డీఆర్‌డీఏ ద్వారా కార్పొరేట్ కళాశాలలో ఉచిత విద్య, ఉపకార వేతనాలతో ఇంటర్ పూర్తి చేసింది. పీజేటీఎస్ఏయూలో ప్రభుత్వ విద్యనభ్యసించి బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసింది. రాయపూర్‌లో ఐజీకేవీలో ప్రభుత్వ సీట్‌తో ఎమ్మెస్సీ చదివింది. ప్రస్తుతం ఈ-సెట్‌లో ఆరో ర్యాంకు సాధించి రాయపూర్ ఐజీకేవీలో జనటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో పీహెచ్‌డీ చేస్తుంది. 2025లో ఏఎస్ఆర్‌బీ నెట్, యూజీసీ నెట్- అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత సాధించిన శ్రీవిద్య తాజాగా ఈజీసీ నెట్-జేఆర్ఎఫ్‌లో 98.4 పర్సంటేజ్ సాధించినట్లు తెలిపింది. ప్రభుత్వ ఉచిత విద్య, ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునని ఆమె అభిప్రాయపడ్డారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, చిత్రంలో నిందితులు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాలో ఇద్దరు వ్యక్తులను హత్య చేసిన కేసులో నిందితులు భూక్యా రాము, భూక్యా పెద్ద బాబు, భూక్యా లక్ష్మీలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదివారం వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుల ఇంటి పక్కనే అమరబోయిన వెంకటేశ్వర్లు ఇల్లు ఉంది. ఆ ఇంటి వేపచెట్టు ఎండిపోయి ఆకులు, కాయలు, దాని నీడ వీరి ఇంట్లో పడి వీరికి కలిసి రావడం లేదని, దానిని తొలగించాలని వెంకటేశ్వర్లుకు చెప్పారు. ఈ విషయంలోనే వీరి మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఇరువర్గాలపైనా కేసులు అయ్యాయి. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్వర్లును చంపితేనే సమస్య తీరుతుందని నిందితులు కుట్ర పన్నారు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం శనివారం వెంకటేశ్వర్లు ఇంట్లో ఉండగా అతన్ని చంపాలని లక్ష్మీ తన ఇద్దరు కొడుకులు రాము, పెద్ద బాబులను రెచ్చగొట్టింది. ఈ క్రమంలో వారిద్దరు వెంకటేశ్వర్లు ఇంట్లోకి ప్రవేశించి వెంకటేశ్వర్లు తలపై గొడ్డలితో దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో వారిని వారించబోయిన వారి తండ్రి భూక్యా సైదులుపై దాడి చేశారు. తమ తండ్రి కూడా వెంకటేశ్వర్లుకు సపోర్టు చేస్తున్నారని తండ్రిపై అక్కసు వెళ్లగక్కారు. తండ్రిని చంపి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులపై కేసు పెట్టాలని ప్రణాళిక వేశారు. ఈ క్రమంలో గొడ్డలి, కర్రలతో కొట్టడంతో సైదాకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కోదాడ ఇన్‌ఛార్జి సీఐ రామకృష్ణారెడ్డి కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

మత్తు..గమ్మత్తుగా గుర్తింపు


పేటెంట్ సంస్థ డైరెక్టర్ శంకర్‌రావు నుంచి జ్ఞాపిక అందుకుంటున్న వసంతారాణి పోతబత్తిని

మఠంపల్లి, న్యూస్‌టుడే: మేధోసంపత్తి రంగంలో నిజామాబాద్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ మహిళా కళాశాల డీఎల్ డాక్టర్ వసంతారాణి పోతబత్తిని 'ఓరల్ డ్రగ్ డిటెక్షన్ డివైస్' నూతన ఆవిష్కరణకు భారత ప్రభుత్వం నుంచి డిజైన్ పేటెంట్‌ను పొందారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన పోతబత్తిని యాకోబు, శాంతమ్మ దంపతుల కూతురు వసంతారాణి ఎంఏ, బీఈడీ, పీహెచ్‌డీ పూర్తి చేసి అదే కళాశాలలో ప్రస్తుతం చరిత్ర విభాగానికి హెచ్‌వోడీగా ఉన్నారు. రక్తం, మూత్రం నమూనాల ద్వారా కాకుండా లాలాజలాన్ని(ఓరల్ ఫ్లూయిడ్) పరీక్షించి క్షణాల్లోనే మత్తు పదార్థాలను తీసుకున్న వారిని గుర్తించే పరికరం కనుగొన్న ఆమెకు ఈ అరుదైన గౌరవం లభించింది. నోటి ఉమ్మి నమూనా ఆధారంగా ఆన్-సైట్ ప్రాథమిక డ్రగ్ స్క్రీనింగ్ చేయడానికి ఇది దోహద పడుతుంది. దీని ఆకృతి, నిర్మాణం, బాహ్య రూపకల్పన వంటి ప్రత్యేకతలకు డిజైన్ రిజిస్ట్రేషన్ లభించినట్లు వసంతారాణి పేర్కొన్నారు.

వినియోగ రంగాలు.. ప్రయోజనాలు

డిజిటల్ డిస్‌ప్లే ద్వారా ఫలితాలను వెంటనే తెలుసుకునేలా ఏఐ, ఎల్‌ఓటీ, బ్లూటూత్, డేటా ఎనాలిటిక్స్ వంటి అధునాతన సాంకేతికతను అనుసంధానించి రిమోట్ మానిటరింగ్ చేసేలా దీనిని మరింత అభివృద్ధి చేయవచ్చు. రవాణా, లాజిస్టిక్స్, పాఠశాలల, బస్సు డ్రైవర్ల భద్రతా తనిఖీలు, పరిశ్రమల్లో కార్మికులను పరీక్షించేందుకు వినియోగించవచ్చు. ప్రమాదకర డ్రగ్స్‌పై విద్యాసంస్థలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ ఇవ్వడానికి వీటిని ఉపయోగిస్తారు.

ఎలా పని చేస్తుందంటే...

ఈ పరికరం వ్యక్తి ఉమ్మి ద్వారా పని చేస్తుంది. రక్తం, మూత్ర పరీక్షలతో పోలిస్తే ఇది సులభంగా, వెంటనే నమూనా సేకరించగలిగే పద్ధతి. పరికరంలో ముందుగానే అమర్చిన ప్రత్యేక స్ట్రిప్స్ ఉంటాయి. నోటి నమూనాలో మత్తు పదార్థాల గుర్తులు ఉంటే అవి రియాజెంట్లతో చర్య జరుపుతాయి. డ్రగ్స్ ఉనికిని బట్టి పరికరం టెస్ట్ లైన్‌పై రంగు మారడం, లేదా మార్కింగ్స్ వస్తాయి. దీంతో మత్తుపదార్థాలు తీసుకున్నారా.. లేదా అనే విషయం ప్రాథమికంగా గుర్తించవచ్చు. ఇది తక్షణ ఫలితాలను ఇచ్చే ప్రాథమిక స్క్రీనింగ్ పరికరం.

మార్గదర్శకులు ఎందరో...


ఓరల్ డ్రగ్ డిటెక్షన్ డివైస్ పరికరం

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా ఉండాలన్నది తన అభిప్రాయమని వసంతారాణి చెప్పారు. ప్రస్తుత గుర్తింపు మరింత బాధ్యతను పెంచినట్లు తెలిపారు. సుమారు 10 నెలల కఠోర శ్రమ వెనుక ఎందరో మార్గదర్శకులు, సహచరులు ఉన్నట్లు వెల్లడించారు. మేధో సంపత్తి హక్కులను పొందాల్సిన అవసరం నేటి యువతపై ఉందని చెప్పే డా.ఎంఎస్‌కే రావు రీసెర్చ్ అండ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ డైరెక్టర్ డా.శంకర్‌రావు ముంజం తనకు స్ఫూర్తి అని తెలిపారు.

ముగిసిన అత్యాపత్య రాష్ట్ర స్థాయి పోటీలు

◆ బాలురలో హైదరాబాద్.. బాలికల్లో నాగర్‌కర్నూల్ విజయం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో.. రంగారెడ్డి (ద్వితీయ), తృతీయ స్థానంలో నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో.. నిర్మల్ (ద్వితీయ), తృతీయ స్థానంలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు నిలవగా. . క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వస్నెల భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్ముకశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో హాజరుకానున్నారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు పరమేశ్వర్, బాధ్యులు అజయ్, అమర్‌సింగ్, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం?

దామరచర్ల, మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: దివ్యాంగురాలిపై అత్యాచారం జరిగిన ఘటన నల్గొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని ఓ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు (52) తన తల్లితో కలిసి నివాసం ఉంటోంది. ఆదివారం ఉదయం బాధితురాలి తల్లి మిర్యాలగూడలోని ఆసుపత్రికి వెళ్లింది. దివ్యాంగురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మధ్యాహ్నం సమయంలో ప్రవేశించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు కేకలు వేయడంతో ఆమె కాళ్లు, మెడకు తాడుతో కట్టేసి ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు వెళ్లేటప్పుడు బయటి నుంచి తలుపు వేసి గొళ్లెం పెట్టి తాడుతో కట్టాడు. మిర్యాలగూడలోని ఆసుపత్రికి వెళ్లి వచ్చిన దివ్యాంగురాలి తల్లి ఇంటి తలుపునకు గడియ పెట్టి, దానికి తాడుకట్టి ఉండటంతో కుమార్తెను పేరు పెట్టి పిలవగా ఇంట్లో నుంచి మూలుగులు వినిపించాయి. ఇరుగు పొరుగు వారి సాయంతో తలుపు తెరిచి చూడగా తాళ్లతో కట్టి, ముఖానికి దెబ్బలతో ఉన్న కుమార్తె కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీం సహాయంతో వివరాలు నమోదు చేసుకున్నారు. దివ్యాంగురాలిని వైద్య పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. దివ్యాంగురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్ సందర్శించారు. ఆయన వెంట వాడపల్లి ఏఎస్సై జోజి ఉన్నారు.

కోదాడ

•కోదాడ •హుజూర్‌నగర్

ఘనంగా గంగమ్మ జాతర



గంపలతో వెళ్తున్న మహిళలు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: పట్టణంలో గంగమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు గంపలతో ఊరేగింపుగా అమ్మవారి వద్దకు చేరుకున్నారు. నృత్యం చేస్తూ ఆకట్టుకున్నారు. అమ్మవారికి బోనాలను చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పోతగాని శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఛైర్మన్ తన్నీరు మల్లికార్జున్‌రావు, భారాస నాయకులు రఘు, కొన్ని ఇర్లు, తదితరులు పాల్గొన్నారు.

కమిటీలు సమర్థంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు చంద్రయ్య

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: గ్రామ కమిటీలు సమర్థంగా పని చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు యడవెల్లి చంద్రయ్య కోరారు. మండలంలోని కందులవారిగూడెంలో ఆదివారం యడవెల్లి అరుణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పోల్సాయి మధు, ప్రధాన కార్యదర్శిగా ఎల్లయ్య, కార్యదర్శులు సుధాకర్, సాయికుమార్, కోశాధికారి నాగరాజు, అధికార ప్రతినిధిగా కర్నాకర్, మహిళా అధ్యక్షురాలిగా కృష్ణవేణి ఎన్నికయ్యారు.

ఎత్తిపోతల పథకాలను నిర్వహించాలి

మునగాల, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాల్వపై ఉన్న ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహించాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లిఫ్ట్ మోటార్లు మరమ్మతుకు గురై, కాల్వలు సక్రమంగా లేకపోవడంతో వివిధ భూములకు సాగు నీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘాలకు లిఫ్ట్‌ల నిర్వహణ భారంగా మారిందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలని నిరసనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దేవరం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్: బొల్లం



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్, నాయకులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడ పట్టణంలో పాన్ డబ్బా నడుపుతూ జీవనం సాగిస్తున్న నిరుపేద మహిళ గంధం కనకమ్మపై పట్టణ సీఐ శివశంకర్ దౌర్జన్యంగా వ్యవహరించారని ఆరోపిస్తూ భారాస తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోరారు. పట్టణంలో ఆదివారం ఉదయపు నడకలో భాగంగా ప్రజలను, వ్యాపారులను కలిసి బంద్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రజల హక్కులను కాపాడాల్సిన పోలీసులు ఇలా ప్రవర్తించడం బాధాకరమన్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు భారాస అండగా ఉంటుందని తెలిపారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారాస నాయకులు కిరణ్‌కుమార్, తుమ్మలపల్లి భాస్కర్‌రావు, కరీముల్లాబాబా, నరేష్, గోపాల్, మల్లయ్యగౌడ్, రాజేష్, జాని తదితరులున్నారు.

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడలో డబ్బా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్న గంధం కనకమ్మపై పట్టణ సీఐ ప్రదర్శించిన దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తూ కోదాడ బంద్‌ను విజయవంతం చేయాలని భారాస పట్టణ అధ్యక్షుడు షేక్.నయీమ్ కోరారు. కోదాడ పట్టణం, నియోజకవర్గ ప్రజలు, పుర ప్రముఖులు, వర్తక, వాణిజ్య, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థల యాజమాన్యాలు, వీధి వ్యాపారులు సహకరించి బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక

మఠంపల్లి, న్యూస్‌టుడే: ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో ఈ నెల 27న సూర్యాపేటలో నిర్వహించిన 'పుణ్యభూమి నా దేశం' భిన్న పాత్రల అభినయం రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన 14 మంది కళాకారుల బృందం ఛత్రపతి శివాజీ, అల్లూరి సీతారామరాజు, నేతాజీ సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ తదితర వేషధారణలో ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనలో మేజర్ చంద్రకాంత్ పాత్రధారి మఠంపల్లికి చెందిన బీవీ రామారావు ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో 'పుణ్యభూమి నా దేశం' ప్రదర్శించనున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 14 బృందాలు ప్రదర్శనలో పాల్గొన్నాయని తమకు ప్రథమ స్థానం లభించిందని బృందం ఇన్‌ఛార్జి రామారావు తెలిపారు.

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

కోదాడ, న్యూస్‌టుడే: పట్టణంలో చాలా వార్డుల్లో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. వర్షాకాలం నేపథ్యంలో ఆ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడంతో విష పురుగులకు ఆవాసంగా మారాయి. దీంతో రాత్రి సమయంలో అవి బయటకు రావడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. పుర అధికారులు ఇప్పటికైనా ఖాళీ స్థలాల్లో పెరిగిన చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఈ చిత్రంలో ఇళ్ల వెనుక దట్టంగా చెట్లు పెరిగిన ప్రాంతం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనక వీధి. ఇక్కడ దాదాపు పది ఖాళీ స్థలాలు ఉండటంతో పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగాయి. దీంతో విష పురుగులతో సమస్యగా మారిందని స్థానికులు భయపడుతున్నారు. చెట్లను తొలగించాలని పుర అధికారులకు సైతం ఫిర్యాదు చేసిన ఎలాంటి ప్రయోజనం లేదని వాపోతున్నారు.

◆ ఇటీవల పట్టణంలోని కేఎల్ఆర్ కాలనీలో ఓ ఇంటి సమీపంలోకి పాము రావడంతో స్థానికులు భయాందోళనకు చెందారు. పిల్లలను ఆడుకునేందుకు బయటకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. పాములు బయటకు వస్తున్నాయి అనడానికి ఈ ఘటనే ఒక సాక్ష్యం.

పుర అధికారుల నిర్లక్ష్యమే..

– జనపదు, సామాజిక కార్యకర్త, కోదాడ పట్టణం

పట్టణంలోని చాలా వార్డుల్లోని ఖాళీ స్థలాల్లో విచ్చలవిడిగా చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిని తొలగించాలని చాలా ఏళ్ల నుంచి పుర అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న ఎలాంటి ఫలితం లేదు. కనీసం క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు.

నోటీసులు జారీ చేసి తొలగిస్తాం..

– రమాదేవి, పుర కమిషనర్ కోదాడ పట్టణం

పట్టణంలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిన మాట వాస్తవమే. వాటిని తొలగించి స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. వారు శుభ్రం చేయకపోతే పురపాలిక తరపున స్థలాలను శుభ్రం చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

80085 50363, 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని శ్రీనివాస థియేటర్ వెనుక బజారులో మురుగు కాలువలు శుభ్రం చేయడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. వెంటనే శుభ్రం చేయాలి. – శ్రీధర్, కోదాడ.

✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం. – సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కోదాడ

నడిగూడెం, న్యూస్‌టుడే:

? చాకిరాల రోడ్డు వారధి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. మరమ్మతు పనులు చేపట్టాలి – శ్రీనివాసరావు, చాకిరాల

✔ మరమ్మతు పనులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు చేపడతాం. – సత్యనారాయణ, జేఈ రోడ్లు, భవనాలశాఖ

నేరేడుచర్ల, న్యూస్‌టుడే:

? పురపాలికలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలి. – నరేష్, నేరేడుచర్ల

✔ కుక్కల బెడదను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటాం. – సీహెచ్. నాగరాజు, పుర కమిషనర్, నేరేడుచర్ల

శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా కేంద్రంలో సెప్టెంబరు 1, 2 తేదీల్లో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, డివిజన్ ప్రధాన కార్యదర్శి పులి రాఖీ తెలిపారు. స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెండు రోజుల కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఎంపికైనా విద్యార్థి ప్రతినిధులు, ప్రొఫెసర్లు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఈ తరగతులను సీనియర్ న్యాయవాది జి.వెంకటేశ్వర్లు ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో పీడీఎస్‌యూ విద్యార్థి నాయకులు మహేష్, పవన్, వినయ్, నవీన్, నాని తదితరులున్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి

డబ్బా దుకాణం ఏర్పాటు

కోదాడ, న్యూస్‌టుడే: పట్టణంలోని యాదవ బజారులో మురుగు కాల్వపై ఏర్పాటు చేసిన డబ్బా దుకాణాన్ని పుర అధికారులు తొలగించడంతో బాధితులు చేపట్టిన ధర్నాలో పోలీసుల రంగ ప్రవేశంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. గంధం కనకమ్మ అనే మహిళకు డబ్బా దుకాణమే జీవనాధారం అని యాదవ సంఘం నాయకులు ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి డబ్బా దుకాణం ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో ఆదివారం యాదవ సంఘం నాయకుల ఆధ్వర్యంలో అదే స్థలంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఈదుల కృష్ణయ్య, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సైదిబాబు, సూర్యనారాయణ, వెంకన్న, కౌన్సిలర్ పాశం శ్రీను, మాజీ సర్పంచి ఎర్నేని బాబు, తదితరులు పాల్గొన్నారు.



డబ్బా దుకాణం ఏర్పాటు చేసిన నాయకులు

లింగన్న ఆశయ సాధనకు ఉద్యమం



లింగన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పూనెం లింగన్న ఆశయ సాధనకు యువత ఉద్యమించాలని అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి ఉదయగిరి అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా స్థానిక లాల్‌బంగ్లాలో పార్టీ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అతడి ఆశయ స్ఫూర్తి నిత్యం ప్రజలను చైతన్య చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహారావు, విజయ్, రవితేజ, సలీం, ఖాసీం, సాలమ్మ, వెంకన్న, శ్రీను, చోటు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఎమ్మెల్సీ ఇవ్వండి

కోదాడ, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉద్యమ కారులకు అవకాశం ఇవ్వాలని కేజీ టు పీజీ విద్యాసంస్థల ఛైర్మన్ రమణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెఎస్ కళాశాలలో ఉద్యమ కారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పోటీలో ఉన్న కోదాడ ప్రాంతానికి చెందిన ఉద్యమకారుడు, ఉస్మానియా జేఏసీ నాయకుడు భట్టు శ్రీహరికి మద్దతు ప్రకటించారు. శ్రీహరికి విద్యా రంగంలో అనేక సమస్యలపై పోరాటం చేసిన అనుభవం ఉందన్నారు. కార్యక్రమంలో పందిరి నాగిరెడ్డి, వెంకటేశ్వరరావు, చిన్ని, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

కూరగాయల ధరలు

నేరేడుచర్ల, న్యూస్‌టుడే:

టమాట 20, సొర 30, ఆలుగడ్డ 30, బెండ 30, క్యాబేజీ 30, దొండ 30, వంకాయ 40, గోకర 40, కాకర 40, బీర 50, పచ్చిమిర్చి 50, క్యారట్ 50, బీట్‌రూట్ 50, కీరా 50, కాప్సికం 80.

మూసీ వంతెనపై దెబ్బతిన్న కాంక్రీటు

పాలకవీడు మండలం శూన్యపహాడ్ వద్ద మూసీనది వంతెనపై కాంక్రీటు దెబ్బతిని గుంతలు పడ్డాయి. దామరచర్ల, పాలకవీడు, మఠంపల్లి మండలాలను కలిపే రహదారిలో ఈ వంతెన ఉంది. ఈ మార్గంలో సిమెంట్ లారీలు వెళ్తుంటాయి. దీంతో రహదారితో పాటు వంతెనపై మరమ్మతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే రహదారిలో జాన్‌పహాడ్ రైల్వే వంతెనపై సైతం భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, పాలకవీడు




పేరుకుపోయిన వ్యర్థాలు

కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్‌లో చెత్త, వ్యర్థాలు ప్రధాన రహదారి పక్కనే వేస్తున్నారు. వాహనదారులు, స్థానికులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పరిసరాలను శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోదాడ పట్టణం



పగలే వెలుగులు

నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలోని చాలా వీధుల్లో దీపాలు పగటి పూట వెలుగుతున్నాయి. దీంతో గ్రామ పంచాయతీకి విద్యుత్తు బిల్లు భారం పెరిగిపోతుంది. గ్రామ పంచాయతీల్లో సరిపడా నిధులు లేక వసతుల కల్పనలో విఫలం అవుతున్నాయి. వందల సంఖ్యలో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్న పాలకులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. – న్యూస్‌టుడే, నేరేడుచర్ల



రక్షణ కంచె ఏర్పాటు



మఠంపల్లి, న్యూస్‌టుడే: అల్లీపురంలో సీసీ రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావికి రైతులు రక్షణ కంచె ఏర్పాటు చేశారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపితే, రాత్రి వేళ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాపోయారు. గత మార్చిలో 'ఈనాడులో' బావి రూపంలో పొంచి ఉన్న ప్రమాదం కథనం వెలువడింది. సర్పంచి బోగాల జ్యోతి, ఆమె భర్త పిచ్చిరెడ్డి చొరవతో స్పందించి వ్యవసాయ బావి యజమానులు సొంత ఖర్చులతో ఇనుప కంచె తీసుకువచ్చి పెట్టించారు. కోయ రాజశేఖర్, కర్లపూడి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

బోనమెత్తిన పల్లెలు

మఠంపల్లి, న్యూస్‌టుడే: మఠంపల్లిలో ఆదివారం ముత్యాలమ్మ తల్లికి మహిళలు పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. రైతులు ప్రభ బండ్లతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించారు. గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చిలుకూరు: పాత చిలుకూరుతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ముత్యాలమ్మ తల్లి బోనాల పండగను నిర్వహించారు.

హుజూర్‌నగర్ గ్రామీణం: లక్కవరం గ్రామంలో గ్రామదేవత ముత్యాలమ్మ జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలలో బోనాలతో అమ్మవారి వద్ద ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ గురుపాదం, కన్నారెడ్డి, ఉప సర్పంచి శాంతయ్య, మధు, నాగార్జున, కీత చంద్రరావు, దీనయ్య, మన్నెం నర్సయ్య, సతీష్ తదితరులున్నారు.

కోదాడ గ్రామీణం: మండల పరిధిలోని కాపుగల్లులో మహిళలు అమ్మవారికి బోనం సమర్పించారు. బొడ్రాయికి జలాభిషేకం చేశారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ కోరారు. సర్పంచి అప్పారావు, ప్యాక్స్ ఛైర్మన్ సూర్యం, పాపారావు, సైదులు ఉన్నారు.



చిలుకూరులో..



హుజూర్‌నగర్: లక్కవరంలో..

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో ఆదివారం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం వైద్యులు జాస్తి సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా చల్లా రాంమూర్తి, ప్రధాన కార్యదర్శి కొత్తూరు పూర్ణ చందర్‌రావు, కోశాధికారిగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు దంతాల నాగయ్య, సురభి నర్సయ్య, కృష్ణయ్య, నాగేశ్వరరావు, శంకర్, వీరస్వామి, భిక్షమయ్య, సహాయ కార్యదర్శులు సోమేశ్వరరావు, నాగనరసింహారావు, సత్యం, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, రాము, కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు.

రోడ్డుపై సంచరిస్తాం.. ఎదురొస్తే దాడి చేస్తాం

చిలుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఆయా గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రహదారులపై గుంపులుగా సంచరించి దాడులు చేస్తున్నాయి. దీంతో వీధుల్లో నడవాలంటే ప్రజలు వణికిపోతున్నాయి. మండల కేంద్రంతో పాటు, చెన్నారిగూడెం, బేతవోలు, నారాయణపురం, ఆచార్యులగూడెం, దూదియా తండా తదితర గ్రామాల్లో శునకాలు చాలా మందిపై దాడి చేశాయి. గాయపడిన వారు ఇప్పటికే మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. మూగజీవాలపై దాడులు చేస్తున్నాయి. ఇటీవల కట్టకొమ్ముగూడెంలో ఓ దూడపై పది కుక్కలు దాడి చేసి చంపాయి.



చిలుకూరులో రహదారిపై శునకాలు

వాహనాల వెంట పడుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో గ్రామ పంచాయతీ అధికారులు, సర్పంచుల ఆధ్వర్యంలో నివారణ చర్యలు ఉండేవి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

రాత్రి వేళ ఇబ్బందులు..

రాత్రి వేళ కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారితో పాటు మండల కేంద్రం నుంచి కట్టకొమ్ముగూడెం, సీతరాంపురం నుంచి నారాయణపురం, చిలుకూరు నుంచి దూదియాతండాకు వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు భయపడుతున్నారు.

సమస్యను ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

– నర్సింహారావు, ఎంపీడీవో, చిలుకూరు

మండలంలోని ఆయా గ్రామాల్లో కుక్కల బెడద ఉన్న మాట వాస్తవమే. గ్రామాల్లో నెలకొన్న పరిస్థితిని జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

భూ వివాదంలో ఒకరికి గాయాలు

మఠంపల్లి, న్యూస్‌టుడే: భూ వివాదంలో ఒకరికి గాయాలైన ఘటన బక్కమంతులగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూమి హద్దు విషయంలో అదే గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డికి మధ్య వచ్చిన మనస్పర్థలు ఘర్షణకు దారి తీశాయి. శ్రీనివాసరెడ్డి తనపై కర్రతో దాడి చేశారని నాగిరెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చెప్పారు. బాధితుడి తలకు స్వల్ప గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు.

సిమెంట్ బస్తాల వితరణ

నడిగూడెం, న్యూస్‌టుడే: నడిగూడెంలో నిర్మిస్తున్న సీతారామ కల్యాణ మండపం పనులకు జగ్గయ్యపేటకు చెందిన అప్పన మణికుమార్, కమల కుటుంబ సభ్యులు 100 సిమెంట్ బస్తాలు అందించినట్లు కమిటీ కార్యదర్శి కొండా వెంకన్న తెలిపారు. దాతలను కమిటీ సభ్యులు అభినందించారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

కోదాడ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిపై కొందరు ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో గాలి శ్రీనివాస్ నాయుడు, ఎస్టీ సెల్ నాయకులు సీతారామ్‌సింగ్, తదితరులున్నారు.

నూతన విధానంలో మూల్యాంకనం

నడిగూడెం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే ఎస్ఏ.1, ఎస్ఏ.2 పరీక్షల్లో నూతన మూల్యాంకన విధానం అమలు చేస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మూల్యాంకనంలో పారదర్శకత, ఖచ్చితత్వం, జవాబుదారీతనం పెంచడానికి పాఠశాల విద్యాశాఖ ఎక్స్‌టర్నల్ మూల్యాంకనాన్ని అమలులోకి తెచ్చింది. పరీక్షలు ఎప్పటిలాగానే సంబంధిత పాఠశాలల్లో నిర్వహిస్తారు. పరీక్ష పూర్తయిన వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయులు జవాబు పత్రాలను సీల్ చేసి మండల విద్య వనరుల కేంద్రానికి తరలిస్తారు. ఎక్స్‌టర్నల్ మూల్యాంకనంలో వేరే పాఠశాలల ఉపాధ్యాయుల ద్వారా మండల స్థాయిలో మూల్యాంకనం నిర్వహిస్తారు. ఏ ఉపాధ్యాయుడికి తన సొంత పాఠశాల పేపర్లు కేటాయించే వీలులేదు.

మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు..

మూల్యాంకన ప్రక్రియ 3 నుంచి 5 రోజుల లోపు పూర్తి చేయాలి. మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఈ ప్రక్రియ నిర్వహణకు పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, మండల స్థాయిలో ఎంఈవోలు కేంద్రాల ఏర్పాటు ఇన్‌ఛార్జి నియామకం, పేపర్ల భద్రత ఆన్‌లైన్ నమోదు పర్యవేక్షణ చేపట్టనున్నారు. జిల్లా స్థాయిలో డీఈవోల పర్యవేక్షణ ప్రణాళిక క్యాంపుల తనిఖీ నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీని నిర్వహణకు బడ్జెట్ కేటాయించారు. మండల స్థాయిలో క్యాంపు నిర్వహణకు రూ.10 వేలు కేటాయించారు. ప్రాథమిక స్థాయిలో జవాబు పత్రాల మూల్యాంకనానికి రూ.2 చొప్పున, ఉన్నత పాఠశాల స్థాయిలో రూ.3 చొప్పున చెల్లించనున్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



క్రీడలతో ఉపాధి అవకాశాలు పెరిగాయని మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో ఆదివారం మహిళల మోడ్రన్ కబడ్డీ ఛాలెంజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. పోటీల్లో మొత్తం 18 జట్లు పాల్గొనగా కరివిరాల మోడల్ స్కూల్ (ప్రథమ), అనంతగిరి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల (ద్వితీయ), గరిడేపల్లి జిల్లా పరిషత్ గురుకుల పాఠశాల (తృతీయ), కోదాడకు చెందిన హైదరాబాద్ ప్రైడ్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు నాలుగో స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో మట్టపల్లి సతీష్ గౌడ్, సీహెచ్. వీరయ్య, లెనిన్, నాగయ్య, సురేష్, గురవయ్య, వీరస్వామి తదితరులున్నారు. – న్యూస్‌టుడే, హుజూర్‌నగర్

ఉత్తమ రెఫరీ అవార్డు ప్రదానం



సుమన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న క్రాంతికుమార్

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడకు చెందిన కరాటే మాస్టర్ కొండపల్లి క్రాంతి కుమార్‌కు ఉత్తమ రెఫరీ అవార్డు లభించింది. విజయవాడ గాంధీనగర్‌లోని కొవ్వూట కళా వేదికలో ఆదివారం 7వ ఆస్మా యూనివర్సరీ రెఫరీ శిక్షణ శిబిరంలో ఈ గౌరవాన్ని అందుకున్నారు. ముఖ్య అతిథి సినీ హీరో సుమన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కరాటే, మార్షల్ ఆర్ట్స్ రంగాల్లో క్రాంతికుమార్ అందిస్తున్న సేవలు, రెఫరీగా నైపుణ్యం, క్రీడాభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు క్రాంతికుమార్‌ను అభినందించారు.

సూర్యాపేట
• సూర్యాపేట • తుంగతుర్తి

శ్రీ సూర్య క్షేత్రంలో పూజలు



జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తిమ్మాపురంలోని శ్రీ అఖండ జ్యోతి స్వరూప శ్రీ సూర్యనారాయణ స్వామి ద్వాదశ ఆదిత్యాది క్షేత్రంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్రం ఆవరణలోని శ్రీ రామస్తూపం, శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సమయంలో సౌర హోమం నిర్వహించారు. క్షేత్ర వ్యవస్థాపకురాలు కాకులారపు రజిత, గణపురం నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు భీంపాండే, అంకిత్ పాండే పాల్గొన్నారు.

కూలిన ప్రహరీ నిర్మించరూ..!



సూర్యాపేట మండలంలోని టేకుమట్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రహరీ కూలిపోయింది. గోడ లేకపోవడం వల్ల విద్యార్థులకు అసౌకర్యం కలుగుతుంది. సెలవు రోజుల్లో పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీకి మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ సమస్యపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.
–న్యూస్‌టుడే, సూర్యాపేట గ్రామీణం,

టీపీసీసీ ఆదేశాల తర్వాతే నూతన కమిటీలు



తుంగతుర్తిలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య

తుంగతుర్తి, న్యూస్‌టుడే: తుంగతుర్తి నియోజకవర్గంలో మండల, గ్రామ నూతన కమిటీల ఏర్పాటు టీపీసీసీ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతనే ఎంపిక జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య అన్నారు. టీపీసీసీ ఆదేశాల మేరకు తుంగతుర్తిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో ఇటీవల మండల కమిటీల ఎంపికలో నాయకులు, సీనియర్ కార్యకర్తల మధ్య అభిప్రాయ బేధాలు రాగా వారు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి సమస్యలను విన్నవించుకున్న సంగతి విదితమేనని అన్నారు. ఈ మేరకు ఆయన జరిగిన సంఘటనలపై పూర్తి నివేదికను సుమన్ అభియాన్ ఛైర్మన్ వేణుగోపాల, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు అందించినట్లు తెలిపారు. ఆ నివేదిక పరిశీలన అనంతరం తీసుకునే నిర్ణయాల తర్వాతనే వారి ఆదేశాల ప్రకారం నియోజకవర్గంలో మండల, గ్రామ, ఇతర కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, మడ్డి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ



చందుపట్లలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ చేస్తున్న ఆలయ అర్చకులు, నిర్వాహకులు

మద్దిరాల, న్యూస్‌టుడే: మద్దిరాల మండలంలోని ఆయా గ్రామాల్లో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ఘనంగా చేపట్టారు. చందుపట్లలోని శ్రీ శివరామక్షేత్రంలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ, పోలుమల్లలో ముత్యాలమ్మ, పోతరాజు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిపించారు. ఆయా గ్రామాల్లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు విగ్రహ దాతలు, భక్తులతో పండగ వాతావరణం నెలకొంది. ఆలయ అర్చక యజ్ఞిక బృందం ఆధ్వర్యంలో శివరామ క్షేత్రంలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు.

'పాలకుల నిర్లక్ష్యంతో సాధించుకోలేకపోయాం'



మాట్లాడుతున్న బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరెడ్డి

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: బుల్లెట్ ట్రైన్ సాధన సమితి అఖిల పక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆదివారం అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రాష్ట్రాల రాజధానుల మధ్యలో ఉన్న సూర్యాపేట పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా సాధించుకోలేకపోతున్నామని స్పష్టం చేశారు. ఈ దీక్షలో భాస్కరమ్మ, వసంత, ఏకలక్ష్మి, సంతోష కుమారి, వెలుగు వనిత పాల్గొన్నారు. ఈ దీక్షకు బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకిరెడ్డి, రమణాచారి, ధర్మార్జున్, డేవిడ్, కోటగిరి వెంకట నారాయణ, నెమ్మాది వెంకటేశ్వర్లు మట్టిపెల్లి సైదులు, జీడీ భిక్షం సంఘీభావం తెలిపారు.

కనిపించని చెత్తబండి

◆ మూడు రోజులకోసారి వస్తున్న వైనం



సూర్యాపేటలోని మార్కెట్ రోడ్డులో చెత్త కుప్ప

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలో చెత్త సేకరణలో పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారు. రోజువిడిచి రోజు సేకరణ చేపట్టాల్సి ఉన్న మూడురోజుల తర్వాత వార్డుకు వాహనం వస్తోంది. ఈ కారణంగా ఇళ్లలో చెత్త పేరుకుపోతోంది. చేసేది లేక పలు వార్డుల్లో కాలనీ వాసులు రోడ్ల వెంట పారబోస్తున్నారు. వెంటనే తరలింపు చేపట్టకపోవడంతో అపరిశుభ్రంగా మారుతోంది.

ఇదీ పరిస్థితి...

పట్టణంలో 48 వార్డులు ఉన్నాయి. చెత్త సేకరణకు 38 ఆటోలు, 10 ట్రాక్టర్లు, రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది మొత్తం కలిపి 463 మంది ఉన్నారు. వార్డుకొక వాహనం ఉన్నా సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలు వార్డుల్లో మూడు రోజులకోసారి సేకరణ జరుగుతుండటంతో అపరిశుభ్రత నెలకొంటోంది. ఆదివారం, పండగల సెలవులు వస్తే చెత్త తరలింపు సమయం నాలుగు రోజులు పడుతుంది. దీంతో ఇళ్లల్లో కుప్పలు తెప్పలుగా చెత్త పేరుకుపోతోంది. ఇళ్లలో ఎక్కువగా తడి, పొడి చెత్త ఉంటోంది. రోజుల తరబడి తడి చెత్త నిల్వ ఉండటంతో భరించలేని దుర్వాసన వస్తోంది.

✦ సూర్యాపేట పట్టణంలో రెగ్యులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పక్క పురపాలికకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకు పూర్తిస్థాయి సిబ్బందిని నియమించలేదు. కార్యాలయంలోని ఇతర సిబ్బందికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. పనిభారం పెరిగి నిర్వహణ విషయంలో కొంత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా పుర అధికారులు పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చర్యలు తీసుకుంటాం...

–హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట

పట్టణంలో చెత్త సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులు మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి సమస్య లేకుండా చూస్తాం. వార్డు ప్రజలు కూడా కాలనీకి చెత్త వాహనం రాకుంటే వార్డు అధికారి, పుర కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చు. ఇక నుంచి తరలింపులో ఇక్కట్లు లేకుండా చూస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

సూర్యాపేట: 9154395978, తుంగతుర్తి: 80085 74450

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని జాతీయ రహదారి నుంచి చింతలచెరువు వెళ్లే సీసీ రోడ్డు గుంతలమయంగా మారింది. వాహనదారులు, కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మతు చేపట్టాలి. –సైదులు.

✔ పరిశీలించి మరమ్మతు చేయిస్తాం.
–హన్మంతరెడ్డి, పుర కమిషనర్, సూర్యాపేట.

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేటలోని తిలక్‌నగర్‌లో మురుగు కాల్వల్లో పూడిక తీయడం లేదు. కాల్వలు నిండి దుర్వాసనతో కాలనీవాసులు నరకయాతన పడుతున్నారు. వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. –మధు.

✔ దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తాం.
–యాదగిరి, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట.

తిరుమలగిరి, న్యూస్‌టుడే:

? పురపాలిక పరిధిలోని అనంతారం వద్ద జాతీయ రహదారిపై వీధి దీపాలు పూర్తి స్థాయిలో వెలగక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. –కె.రాములు, అనంతారం.

✔ గుత్తేదారుకు చెప్పి పూర్తి స్థాయిలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. –వెంకన్న, పుర కమిషనర్

చివ్వెంల, న్యూస్‌టుడే:

? గుంజలూరు గ్రామం నుంచి పెన్‌పహాడ్ మండలం రంగయ్యగూడేనికి వెళ్లే దారితో పాటు మునగాల మండలం మాధవరానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. మరమ్మతులు చేయించాలి. – దొనకొండ వెంకటయ్య, గుంజలూరు.

✔ రహదారులు పరిస్థితి గురించి మా దృష్టికి వచ్చింది. గ్రామ సభలో పాల్గొన్న కలెక్టర్ దృష్టికి ఈ రహదారుల గురించి సర్పంచి సైతం తెలియజేశాడు. అనంతరం ఉన్నతాధికారుల చొరవతో రహదారుల నిర్మాణ విషయంపై ప్రణాళికలు వేయాలనే ఆదేశాలతో నివేదికలు పంపాం. వారంలో ఏర్పాటుకు అనుమతులు రానున్నాయి.
–రాహుల్ పంచాయతీరాజ్ ఏఈ, చివ్వెంల.



సూర్యాపేట పురపాలిక, భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట పట్టణంలోని పలు సమస్యలపై స్థానికుల సమాచారం మేరకు 'మేమున్నాం..మీకు తోడు'గా శీర్షికలో ఈ నెల 30న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలకు సంబంధిత అధికారులు స్పందించారు.

✦ సూర్యాపేటలోని అన్నాదురైనగర్ నుంచి తాళ్లగడ్డ వరకు సీసీ రహదారి గుంతలమయంగా మారడంతో పుర అధికారులు పరిశీలించారు. గుంతలు పూడ్చివేయాలని సిబ్బందికి సూచించారు.

✦ సూర్యాపేటలోని హనుమాన్‌నగర్‌లో దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో పుర అధికారులు దోమల నివారణ మందు పిచికారీ చేయించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



బీబీగూడెంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

చివ్వెంల, న్యూస్‌టుడే: గ్రామాల్లో శాంతిభద్రతల రక్షణకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. సూర్యాపేట పురపాలిక పరిధి మూడో వార్డులోని బీబీగూడెంలో పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం కట్టడి ముట్టడి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. నేరాల నివారణలో ప్రజలు పోలీసులతో భాగస్వామ్యం కావాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను పెద్ద మొత్తంలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. యువత ఆదర్శంగా ఉండాలని, గ్రామస్థులు కొత్తవారికి ఆశ్రయం ఇవ్వకూడదని సూచించారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తులతో పాటు అనుమానిత వ్యాపారాలు నిర్వహిస్తున్న వారి గురించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ మోసాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో సరైన అనుమతి పత్రాలు లేని 52 ద్విచక్ర వాహనాలు, 4 కార్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. గ్రామీణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఎస్సైలు వి.మహేశ్వర్, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు



ఉత్సవంలో పాల్గొన్న ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డలో శ్రీఇంద్రవెల్లి ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు అమ్మవారికి జలబిందెలతో అభిషేకించి నూతన వస్త్రాలతో శాస్త్రోక్తంగా అలంకరించారు. అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వగా అమ్మవారి ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, భాజపా రాష్ట్ర నాయకులు సంకినేని వెంకటేశ్వర్లు, జుట్టుకొండ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బైరు వెంకన్న గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తదితరులు

నేటి నుంచి గ్రామసభలు

నూతనకల్, న్యూస్‌టుడే: వీబీజీ రాంజీ పథకం కింద ప్రతి కుటుంబానికి 125 రోజుల ఉపాధి హామీ పనిదినాలు కల్పించాలనే లక్ష్యంతో నేటి నుంచి మండలంలోని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి పనుల గుర్తింపు చేపట్టనున్నట్లు ఎంపీడీవో సునిత ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని 17 గ్రామపంచాయతీల్లో నేటి నుంచి సెప్టెంబరు 3 వరకు నాలుగు బృందాలుగా ఈ సభలు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రజలు గ్రామసభలో పాల్గొని పనుల గుర్తింపులో భాగస్వాములు కావాలని సూచించారు.

పొంచి ఉన్న అపాయం



తిరుమలగిరి పురపాలికలోని 13వ వార్డులోని అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఇళ్ల మధ్య పాడు పడిన వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. చుట్టూ ఇళ్లు నిర్మించడంతో బావి నిరుపయోగంగా మారి అప్పుడప్పుడు వచ్చే వర్షపు నీటితో నిండి ఉంది. చుట్టూ పక్క ఇళ్లల్లో ఉండే వారు ఇంట్లోని వ్యర్థాలను ఈ బావిలో పడేస్తుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బావిని పూడ్చే వరకు కనీసం బావి వైపు వెళ్లకుండా రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పుర కమిషనర్ సిహెచ్. వెంకన్నను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి.. వీలైనంత త్వరగా బావిని పూడ్చి ప్రజా అవసరాల కోసం ఏదైనా నిర్మాణం చేపడతామన్నారు. –న్యూస్‌టుడే, తిరుమలగిరి

సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు



నూతనకల్‌లో మాట్లాడుతున్న కట్ట మల్లారెడ్డి

నూతనకల్, న్యూస్‌టుడే: నూతనకల్, మద్దిరాల మండలాల రైతులకు పట్టాలు అందించడంలో పాల్గొని విజయవంతం చేసిన రైతులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నూతనకల్ మండలాధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి పేర్కొన్నారు. నూతనకల్‌లో ఆయన ఆ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యేకు ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, నూతనకల్ ఉప సర్పంచి నాగం సరిత, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డుపల్లి అంజయ్య, నకిరేకంటి వెంకన్న, సేవాదల్ నియోజకవర్గ అధ్యక్షుడు పాల్వాయి పరశురాములు, చురకంటి చంద్రారెడ్డి, ఇమ్మారెడ్డి మహేష్‌రెడ్డి, జటంగి గణేష్, మద్దెల సురేందర్, కిరణ్, సాయికుమార్, శ్రీకాంత్, వెంకన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంచ్ కొడితే పతకమే..!

భానుపురి, న్యూస్‌టుడే: చదువుతో పాటు కరాటేపై మక్కువ చూపుతున్నారు సూర్యాపేటకు చెందిన విద్యార్థులు. తల్లిదండ్రులు కూడా వారికి నచ్చిన వాటిపై తర్ఫీదు ఇప్పిస్తున్నారు. చదువుకు ప్రాధాన్యం ఇస్తూనే కరాటేలో కూడా శిక్షణ పొంది పతకాలు సాధిస్తున్నారు. వారిలో ప్రతిభను గుర్తించి వారిని కరాటే వైపు మళ్లిస్తున్నారు. పట్టణంలోని పలు పాఠశాలల యజమాన్యాలు కూడా వీరిని ప్రోత్సహిస్తున్నారు. సూర్యాపేటలోని సుమన్ షూటోకాన్ స్పోర్ట్స్ కరాటే అకాడమీలో పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఈ కేంద్రంలో 100 మంది వరకు శిక్షణ పొంది ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, పర్పుల్, బ్రౌన్, బ్లాక్ బెల్ట్‌లు సాధించారు.

కరాటే అంటే ఇష్టం...

– కొమ్ము యోగానంద్, 7వ తరగతి, సూర్యాపేట



కరాటే అంటే ఎంతో ఇష్టం. పాఠశాలలో చేరిన తర్వాత కరాటే నేర్చుకోవాలని ఉండేది. పాఠశాల యాజమాన్యం శ్రద్ధ తీసుకొని ప్రత్యేకంగా సమయం కేటాయించారు. ఇప్పటి వరకు హనుమకొండ, ఖమ్మం, హైదరాబాద్‌లో జరిగిన కరాటే పోటీల్లో పాల్గొని బ్లాక్ బెల్ట్ సాధించాను. కరాటే వల్ల శత్రువులు దాడి చేసిన సమయంలో ఎలా ఎదుర్కోవాలో ఉపయోగపడుతుంది. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను.

బాలికలు నేర్చుకోవాలి...

–కె.అక్షర, 9వ తరగతి, సూర్యాపేట



సుమన్ షాటోకాన్ స్పోర్ట్స్‌లో కరాటే శిక్షణ పొందాను. ముఖ్యంగా బాలికలు కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. ములుగు, హైదరాబాద్, ఖమ్మంలో నిర్వహించిన కరాటే పోటీల్లో పాల్గొని బ్లాక్ బెల్ట్ సాధించాను. భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించి ఐపీఎస్ కావాలని ఉంది. మా తల్లిదండ్రులు కూడా కరాటే నేర్చుకోవాలని పట్టుబట్టారు. వారి కోరిక మేరకు నేర్చుకొని పోటీల్లో పాల్గొనడంతో సంతోషంగా ఉంది.

పేదలకు వైద్య సేవలందించడమే ధ్యేయం



శిబిరంలో కంటి పరీక్ష చేయించుకొని శిబిరాన్ని ప్రారంభిస్తున్న సంకినేని కృష్ణారావు

తుంగతుర్తి, న్యూస్‌టుడే: నిరుపేదలకు వైద్య సేవలందించాలనే లక్ష్యంతో శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని.. వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్కేఆర్ మేనేజింగ్ డైరెక్టర్ సంకినేని కృష్ణారావు అన్నారు. ఆదివారం తుంగతుర్తిలో ఎస్కేఆర్ కంపెనీ సౌజన్యంతో వారి తల్లిదండ్రులు సంకినేని రామారావు, కమలమ్మల జ్ఞాపకార్థం కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి హైదరాబాద్ వారి సారథ్యంలో అక్షర ఫౌండేషన్ సూర్యాపేట వారిచే నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లా అంతటా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సుమారు 200 మందిని పరీక్షించి వారిలో శస్త్రచికిత్స అవసరం ఉన్న వారిని గుర్తించారు. త్వరలో వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి సాయిబాబు, ఉప సర్పంచి శ్రీనివాస్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సంతోష్, అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు

రైల్వే లైన్ సాధనలో మౌనం వీడాలి

భానుపురి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని శంషాబాద్ నుంచి సూర్యాపేట మీదుగా చెన్నైకి ప్రతిపాదించిన రైల్వేలైన్ అలైన్‌మెంట్ విషయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డిలు మౌనం వీడాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మార్చి శంషాబాద్ నుంచి చింతపల్లి, హాలియా, వాడపల్లి, దామరచర్ల, గుంటూరు మీదుగా చెన్నైకి రైల్వేలైన్‌ను గుర్తించి కేంద్రానికి లేఖ పంపడం సరికాదన్నారు. ఇప్పటికైనా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డిలు కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసి పాత పద్ధతిలోనే సూర్యాపేట, కోదాడ మీదుగా రైల్వేలైన్ అలైన్‌మెంట్ కొనసాగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

దారంతా గుంతలు.. దాటలేక అవస్థలు



అధ్వానంగా మారిన అల్లునూరు-లింగంపల్లి ప్రధాన రహదారి

నూతనకల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు మారాయి, పాలకులు మారారు. అయినా మండలంలోని ఆయా గ్రామాల అంతర్గత దారులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అధ్వానంగా ఉన్నాయి. ఈ దారుల గుండా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో అదుపు తప్పి వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. రెండు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

అల్లునూరు నుంచి లింగంపల్లి వెళ్లే దారి రెండు కిమీ వెళ్లాలంటే గంటకు పైగా సమయం పడుతుంది ✦ నూతనకల్ నుంచి మిర్యాల వెళ్లే దారిపై అధ్వానంగా ఉంది. ✦ మాచనపల్లి నుంచి పెదనెమిల వెళ్లే దారి కంపచెట్లు గుంతలతో ఇబ్బందిగా ఉంది. ✦ మిర్యాల నుంచి అల్లునూరు వెళ్లే ప్రధాన దారి రెండు దశాబ్దాలుగా కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ✦ ఎర్రపహాడ్ నుంచి ముకుందాపురం వెళ్లే ప్రధాన దారిలో ప్రమాదకరంగా గుంతలు పడ్డాయి.
✦ బిక్కుమళ్ల నుంచి మాచనపల్లి, దిర్శన్‌పల్లి నుంచి జాతీయ రహదారికి వెళ్లే దారులు అధ్వానంగా ఉన్నాయి.



పెదనెమిల నుంచి అల్లునూరు వెళ్లే దారి

అనుమతులు రాగానే నూతన రహదారి నిర్మాణం చేపట్టి సమస్య లేకుండా చూస్తాం.

ప్రమాదాల బారిన పడుతున్నాం...

– ఇర్గు నాగయ్య మిర్యాల.

మిర్యాల నుంచి మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ దారిపై ప్రమాదకరంగా గుంతలు పడ్డాయి. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచి ప్రమాదాల బారిన పడుతున్నాం. రెండు దశాబ్దాలుగా మరమ్మతులు చేయలేదు. ఆపద సమయంలో చుట్టూ తిరిగి 15 కిమీ వెళ్లాల్సి వస్తుంది. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలి.

నివేదికలు పంపించాం...

–కల్యాణ్ పంచాయతీ రాజ్ ఏఈ నూతనకల్.

అంతర్గత రహదారుల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం.

కామళ్ల నవీన్ ఆశయ సాధనకు కృషి

నాగారం, న్యూస్‌టుడే: కార్మిక నాయకుడు కామళ్ల నవీన్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ అన్నారు. డి కొత్తపల్లిలో ఇటీవల నవీన్ మృతి చెందారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్మిక వర్గాల కోసం ఆయన చేసిన త్యాగాలు మరువలేనివని అన్నారు. పీవైఎల్ జిల్లా నాయకుడు పోలెబోయిన కిరణ్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు భయ్యం లింగయ్య, సర్పంచి దోమలపల్లి సంధ్య, నాయకులు గోవర్ధన్, సైదులు, వెంకన్న, లక్ష్మణ్, శ్రీను, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విముక్త జాతుల దినోత్సవం

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తరపున కలెక్టరేట్‌లో సోమవారం విముక్త జాతుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి దారా విశాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిసారిగా నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బీసీ సంఘం, వివిధ సంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.